నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 కరీంనగర్, ఆదివారం 18 ఫిబ్రవరి 2024 KARIMNAGAR

# గుల్జార్‌కు జ్ఞానపీఠ్ అవార్డు హర్షణీయం

### కేంద్రసాహిత్య పురస్కార గ్రహీత వారాల ఆనంద్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 17 : 58వ జ్ఞానపీఠ్ అవార్డుకు హిందీ కవి గుల్జార్ ఎంపికవడంపై కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత వారాల ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన జీవితంలో సాహిత్యంలో చేసిన సేవలను గుర్తించి జ్ఞానపీఠ్ అవార్డు కమిటీ ఈ అవార్డును ప్రకటించిందన్నారు. ఆయన హిందీలో రచించిన 'గ్రీన్ పోయమ్స్'ను తెలుగులో తాను 'ఆకుపచ్చ కవితలు'గా అనువదించడం వల్లే తనకు కేంద్ర సాహిత్య పురస్కారం పురస్కారం లభించిందన్నారు. గుల్జార్ గొప్ప కవి, సినీ గేయ రచయిత, సినీ దర్శకుడు అని, ఆయన రచనలు, సినిమాలు, గజల్స్ అన్నీ సృజనాత్మకంగా, తాత్వికంగా ఉంటాయన్నారు. ఆయన కవిత చదివే పద్ధతి శ్రోతల్ని అమితంగా ఆకట్టుకుంటుందని, సాంస్కృతిక ప్రక్రియల్లో నిరంతర కృషి కొనసాగిస్తున్న ఒక లెజెండ్ అని కొనియాడారు. ఈ పురస్కారం తెలుగులో సినారె, విశ్వనాథ సత్యనారాయణ, రావూరి భరద్వాజ్ ముగ్గురికి వచ్చిందన్నారు.

# కరీంనగర్ డీటీసీగా పురుషోత్తం

### రంగారెడ్డి జిల్లాకు చంద్రశేఖర్‌గౌడ్ • బదిలీ చేస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ

తిమ్మాపూర్, ఫిబ్రవరి 17: ఉమ్మడి కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా హనుమకొండ జిల్లాలో పని చేస్తున్న పురుషోత్తం నియామకమయ్యారు. కాగా, ఇక్కడ పనిచేస్తున్న మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీటీసీతో పాటు ఎంవీఐ నాగలక్ష్మి కామారెడ్డి జిల్లాకు, శ్రీనివాస్ కోరుట్లకు, ఏఎంవీఐ రజినీ దేవీ సిరిసిల్ల జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరీంనగర్‌కు ఆదిలాబాద్ నుంచి ఎంవీఐ రవికుమార్, ఆసిఫాబాద్ నుంచి ఎంవీఐ శ్రీకాంత్, హనుమకొండ నుంచి ఏఎంవీఐ స్రవంతి రానున్నారు. వీరంతా సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశమున్నది.

డీటీసీ పురుషోత్తం



కరీంనగర్: మేయర్ సునీల్‌రావుకు కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్లా హరిశంకర్, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు, కార్యకర్తలు



సిరిసిల్ల టౌన్: కేక్ కట్ చేస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శంకరయ్య, నాయకులు



# బాపు.. వెయ్యేళ్లు వర్ధిల్లు

- పండుగలా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ బర్త్‌డే
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- ఆశ్రమాలు, దవాఖానల్లో పండ్లు పంపిణీ, అన్నదానం
- వెల్లువెత్తిన అభిమానం.. సేవా కార్యక్రమాలు
- సల్లంగా ఉండాలంటూ దీవించిన ప్రజలు



వేములవాడ: రాజన్న ఆలయం ఎదుట కేక్ కట్ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు

**తెలంగాణ సాధకుడు, తొలి సీఎం కేసీఆర్ బర్త్‌డే వేడుక అంబరాన్నంటింది. ఊరూవాడా పండుగచేసుకున్నది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయడంతోపాటు కేకులు కోసి, మిఠాయిలు పంచారు. దవాఖానలు, ఆశ్రమాల్లో పండ్లు పంపిణీ చేయడంతోపాటు పలుచోట్ల అన్నదానాలు చేయగా, పలువురు వినూత్నంగా నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నిండునూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, శతమానం భవతి అంటూ కాంక్షించారు.**




సిరిసిల్ల టౌన్: పంట పొలాల్లో జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిలువెత్తు కేసీఆర్ కటౌట్‌తో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్వీ నాయకులు

పెద్దపల్లి, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ)/ అంతర్గాం : జన హృదయ నేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ తెలంగాణ చౌక్ వద్ద బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో 70 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొన్నారు. అనంతరం మొక్కలను పంపిణీ చేశారు. మేయర్ ఆధ్వర్యంలో కళాభారతి, జిల్లా గ్రంథాలయం, ప్రభుత్వ వైద్యశాల వద్ద 1300 మంది పేదలకు అన్నదానం చేశారు. అయితే ఒక్కో భోజనానికి ₹29 ఖర్చు అవుతుండగా, ఒక్కొక్కరికి ₹29 చొప్పున 1300 మందికి అన్నదానం కోసం సొంతంగా ₹35,300 అందజేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్ కలిసి కేక్ కట్ చేశారు. అలాగే 'గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా కోరుకంటి చందర్ తన సేవా ధృక్పథాన్ని చాటుకున్నారు. అంతర్గాం మండలం విలేజ్ అంతర్గాం గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు కాంపెల్లి ఎల్లమ్మ కోసం ఇంటిని నిర్మించి, గృహప్రవేశం చేయించారు. మేడిపల్లిలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు కలిసి కేక్ కట్ చేశారు. అలాగే వేములవాడ రాజన్న ఆలయంలో నాయకులు కోడె మొక్కు చెల్లించుకున్నారు. ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డా ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తెమ్మ, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు మొగిలి శేఖర్, ఆకుల రాజేశ్ ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పాల్గొని కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు సిఖిందర్ ఆధ్వర్యంలో రగుడు శివారులోని పంట పొలాల్లో కేసీఆర్ నిలువెత్తు కటౌట్‌తో వినూత్నంగా వేడుకలు నిర్వహించారు. మానకొండూర్ పల్లెమీద చౌరస్తా వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, జడ్పీటీసీ శేఖర్ కలిసి కేక్ కట్ చేశారు. గంగాధర మండలం బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మొక్కలు నాటారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ ఎంపీటీసీ ఇల్లెందుల గీతాంజలి కేసీఆర్ బర్త్‌డే సందర్భంగా ఆయన నిండునూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కాంక్షించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం దాకా పాదయాత్ర చేశారు. ఎన్నారై బీఆర్ఎస్ సెల్ అధ్యక్షులు రాధారపు సతీశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పుప్పాల బద్రి కలిసి బహ్రెయిన్‌లోని అండాలస్ గార్డెన్‌లో కేక్ కట్ చేశారు.



పెద్దపల్లి: కేక్ కట్ చేస్తున్న జిల్లా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



రామడుగు(చొప్పదండి): వెలిచాలలోని ప్రశాంత్‌భవన్‌లో విద్యార్థులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు



గంగాధర: బూరుగుపల్లిలో మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



### చేతిపై పచ్చబొట్టు

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ బర్త్‌డే సందర్భంగా ఓ మహిళా నాయకురాలు వినూత్నంగా తన అభిమానాన్ని చాటుకున్నారు. హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లికి చెందిన గొడిశాల పావనిగౌడ్ కేసీఆర్ చిత్రాన్ని ట్యాటు రూపంలో పచ్చబొట్టుగా వేయించుకున్నారు. బాపు అంటే తనకు ప్రాణమని, బాపు కేసీఆర్ ఇక ఎప్పటికీ తనతోనే ఉంటారంటూ ఆమె మురిసిపోయారు.



ఎల్లారెడ్డిపేట: బొప్పాపూర్ నుంచి వేములవాడకు పాదయాత్రగా వెళ్తున్న ఎంపీటీసీ గీతాంజలి, మహిళలు



పాలకుర్తి: అమెరికాలో ఆస్టిన్ పట్టణంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం నాయకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థులు



# అలరించిన సిద్ధార్థ 'సంస్కృతి-2024'

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ విద్యాసంస్థలు అంబేద్కర్ స్టేడియంలో 'సంస్కృతి-2024' పేరిట వార్షికోత్సవాన్ని వేడుకలు నిర్వహించారు. విశిష్ట అతిథిగా డీఈవో జనార్దన్‌రావు, ముఖ్య అతిథిగా క్రిసాలిస్ ఫౌండర్ అండ్ సీఈవో చిత్రా రవి, పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. వివిధ పాటలపై చేసిన నృత్యాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. - కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 17



నృత్యాలను తిలకిస్తున్న అతిథులు

# కోర్టు విధుల్లో బాధ్యతగా ఉండాలి

కరీంనగర్ కోర్టు చౌరస్తా, ఫిబ్రవరి 17: పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోర్టు విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, కేసుల విచారణ సమయంలో జాగ్రత్తగా ఉండాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు సూచించారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు శనివారం కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో ఉమ్మడి జిల్లా వ్యాప్త పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కొత్త చట్టాలపై పోలీస్ అధికారుల రివ్యూ సమావేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పలువురు ప్రాసిక్యూటర్లు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వాటికి సలహాలు, సూచనలు అందించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతి రెడ్డి ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త చట్టాల గురించి వివరించారు. ఈ సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జంగిలి మల్లికార్జున్, బాల త్రిపుర సుందరి, ఆరెల్లి రాములు, జూలూరు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, శరత్, కాసారం మల్లేశం, మురళీధర్‌రావు, వసంతతోపాటు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

సమావేశమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు





పల్లకీసేవలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి

# నేడు వేంకటేశ్వరుడి కల్యాణం

కమాన్ చౌరస్తా, ఫిబ్రవరి 17: శ్రీవారి కల్యాణానికి వేళయింది. కరీంనగర్ మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి సప్తమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవీ భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. కాగా, శ్రీ పద్మావతీ అమ్మవారికి పుట్టింటి వారైనా పద్మశాలీలు శనివారం శోభాయాత్రగా వచ్చి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, పుస్తె, మట్టెలు, సారె సమర్పించారు. రాత్రి నిర్వహించిన ఎదుర్కోళ్ల ఉత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు.